## క్లుప్తంగా

### 'ఎక్సైజ్' దాడుల్లో దేశీదారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దేశీదారుతో ఎక్సైజ్ పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కాపువాడ సమీపంలో ఎక్సైజ్ అధికారులు ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. పట్టణానికి చెందిన డి.ఆకాశ్ ఆటోలో 500 దేశీదారు బాటిళ్లను రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. ఆటోతో పాటు దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకొని ఆకాశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై స్వాతి, సిబ్బంది శ్రీనివాస్, రవి ఉన్నారు.

### ప్రతిఒక్కరూ భక్తిమార్గం అలవర్చుకోవాలి



ప్రవచనాలు బోధిస్తున్న స్వాములు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ భక్తి మార్గం అలవర్చుకోవాలని చిన్నయానందగిరి స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని మోతుగూడలో వేదాంత విచారణ ధ్యాన ఆశ్రమంలో 15వ వార్షికోత్సవం వేడుకలు రెండోరోజు కొనసాగాయి. ఉదయం సుప్రభాతసేవ, సామూహిక భగవద్గీత పారాయణ, తులసి పూజ, ప్రణవ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ సభ్యులు బ్రహ్మయ్య, వినోద్, దాదాజీ, మల్లయ్య, ఆనంద్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో వైకుంఠ చతుర్దశి వేడుకలు



పూజలు చేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో వైకుంఠ చతుర్దశి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చతుర్దశి వేడుకల్లో భాగంగా రాత్రి స్థానిక షిర్డీసాయి మందిరంలో అర్చకులు ఇందారపు మధుకర శర్మ, సాయి శర్మ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం, సహస్ర దీపాలంకరణ, జ్వాలాతోరణం కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు శివలింగాకారంలో దీపాలంకరణ చేశారు. భక్తులు సామూహికంగా రుద్రాష్టకం, చంద్రశేఖరాష్టం, శ్రీమద్భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు తరలి వచ్చారు. వైకుంఠ చతుర్దశి వేడుకల్లో భాగంగా ఉదయం శివకేశవ మందిరంలో కాకడహారతి నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని సోమవారం ఉదయం కాకడ హారతితో పాటు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

### ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని వయోవృద్ధుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు లేఖ రాశారు. సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక క్యూలైన్ల కోసం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు ఈ నెల 21న ఎన్నికల సంఘం అధికారులకు సైతం హైదరాబాద్‌లో లేఖ సమర్పించినట్లు పేర్కొన్నారు. వృద్ధులు ఎక్కువసేపు లైన్‌లో నిలబడలేరని, వారికి సదుపాయం కల్పించాలని విన్నవించారు. నాయకులు పూర్ణచందర్‌రావు, కలికోట రమణయ్య ఎల్లాగౌడ్, వాహబ్, దేవయ్య, ముద్దసాని పాపయ్య, జగదీశ్వర్, తూడూరి ప్రకాశ్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.

### ఈజ్‌గాం ఆలయంలో కార్తీక దీపోత్సవం



దీపాలంకరణలో పాల్గొన్న మహిళలు

కాగజ్‌నగర్‌రూరల్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో ఆదివారం రాత్రి జ్వాల తోరణం, కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు చేశారు.

## వ్యాపారులను ప్రోత్సహించాలి

కెరమెరి: ఏళ్ల కాలంగా వ్యాపారాలు చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించే నాయకులకే మద్దతిస్తామని మండలంలోని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలువురు వ్యాపారులు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

జంగ్ తెలంగాణ

### జీఎస్టీ తగ్గించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు వస్తువులపై విధిస్తున్న జీఎస్టీని తక్షణమే తగ్గించాలి. అమాంతంగా జీఎస్టీ పెంచడం వల్ల ధరలు పెరిగాయి. కొనుగోలు తగ్గింది. జీఎస్టీలపై అవగాహన ఉన్న వారికి నా ఓటు వేస్తా.

- దండుగుల సాయిరాం, కెరమెరి

### వ్యాపారాలపై అవగాహన ఉండాలి



వ్యాపార, విద్యా, ఉద్యోగ, సామాజిక రంగాలపై అవగాహన ఉన్న నాయకుడికే నా మద్దతిస్తాను. అలాంటి వారు అధికారంలో ఉంటే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుంది.

- షేక్ ఇక్బాల్, కెరమెరి

### ధరలు తగ్గించాలి



ప్రస్తుతం అన్ని రకాల వస్తువులపై ధరలు పెరిగాయి. వాటిని తగ్గించే ప్రభుత్వం రావాలి. గతంలో ఉన్న ఆదాయం ఇప్పుడు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

- కేంద్రె విష్ణు, కెరమెరి

### పంటలకు ధరలు పెంచాలి



రైతులు పండించే పంటలకు ధరలు పెంచే ప్రభుత్వానికి నా ఓటు. పత్తి, కందులు, మినుములు, వరి, సోయా తదితర పంటలను రైతులు పండిస్తున్నారు. ధరలు అనుకున్న విధంగా లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో అమ్ముకుంటున్నారు.

- గిత్తే గణేశ్, కెరమెరి

# భరోసానివ్వని 'మద్దతు'

- దిగుబడి తగ్గిన పత్తి, వరి పంటలు
- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- ఆందోళన చెందుతున్న రైతులు



కౌటాల మండలంలో వరిగడ్డి పేరుస్తున్న రైతులు

చింతలమానెపల్లి: జిల్లాలో వరి, పత్తి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతన్నకు ఏమాత్రం భరోసా ఇవ్వడం లేదు. వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడులు భారీగా తగ్గడమే ఇందుకు కారణం. పండించిన పంటల దిగుబడి తగ్గడంతోపాటు పండిన పంటలకు మద్దతు ధర లేక దిగాలు పడుతున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**జిల్లాలో 3.40లక్షల ఎకరాల సాగు భూమి..**

జిల్లాలో 3.40లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. 56వేల ఎకరాల్లో వరి, 2లక్షల 20వేల ఎకరాల్లో పత్తి, మిగతా భూమిలో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. కాగా ఈఏడాది 56 వేల ఎకరాల్లో వరి పంట సాగు కాగా 42వేల మెట్రిక్ టన్నుల దిగుబడిని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం పత్తికి రూ.7020లు మద్దతు ధరతో కొనుగోళ్లు ప్రారంభించగా, వరి ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203లు, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183ల మద్దతు ధర ప్రకటించింది.

**అనుకూలించని వాతావరణం..**

పంటలకు ఈఏడాది వాతావరణం ప్రతికూలంగా మారింది. ఆరంభంలో వర్షాలు కురవకపోవడంతో వేసిన విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో రెండోసారి విత్తనాలు నాటుకోవాల్సి వచ్చింది. అడపాదడపా వర్షాలు భారీగా కురవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విత్తనాలను ఆలస్యంగా నాటుకోవడంతో అంచనా లేని వాతావరణంతో పంట భూముల్లో సకాలంలో రైతులు పనులు చేయలేకపోయారు. పంటలు కీలకదశకు చేరుకున్న దశలో వర్షాలు కురవక పోవడంతో పంటల్లో దిగుబడి గణనీయంగా తగ్గినట్లు రైతులు వాపోతున్నారు.

**వ్యయం ఎక్కువ.. మద్దతు తక్కువ..**

జిల్లాలో ప్రధానంగా రైతులు వరి, పత్తి పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగులో గత ఏడాదికి ఈఏడాదికి వ్యయం గణనీయంగా పెరిగింది. ఈఏడాది పత్తి పంటకు ఎకరానికి సుమారు రూ. 40వేలకు పైగా ఖర్చయింది. ఎకరాకు దిగుబడి 5 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. వరి పంట సాగుకు ఎకరానికి సుమారు రూ.33వేలు ఖర్చవుతుండగా. 17 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. ప్రస్తుత మద్దతు ధరతో పోల్చుకుంటే ఎకరానికి 5క్వింటాళ్ల పత్తికి రూ.7వేల మద్దతు ధరతో రూ.35వేలు మాత్రమే గిట్టుబాటవుతోంది. ఈలెక్కన ఎకరాకు రూ.5వేల నష్టం వస్తుంది. వరి పంట ఎకరానికి సుమారు 17క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా మద్దతు ధర రూ.2200లతో రూ. 38వేలు గిట్టుబాటవుతోంది. గత ఏడాది పత్తి ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రాగా ఈఏడాది 5 క్వింటాళ్లు వచ్చింది. వరి పంట ఎకరానికి గత ఏడాది 22 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రాగా ఈఏడాది 17 క్వింటాళ్లకు పడిపోయింది. రైతులకు పండిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాల్సి ఉండగా మద్దతు ధర లేక రైతులకు నిరాశ మిగులుతోంది.

### దిగుబడి తగ్గింది..



కుటుంబంతో కలిసి రెండున్నర ఎకరాల భూమిలో వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నా. వర్షాలు లేక దిగుబడి చాలా తగ్గింది. పత్తి ఎకరాకు కేవలం 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వరి కోతకు రాగా గతంలో కంటే తక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈసారి పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

- దులాలి గైన్, రవీంద్రనగర్, మం.చింతలమానెపల్లి

### ఈసారి నష్టాలే..



రెండున్నర ఎకరాల్లో వరి పంట పండించాం. కాని దిగుబడి సరిగా రాలేదు. గత ఏడాదితో పోల్చుకుంటే చాలా తక్కువగా పంట దిగుబడి వచ్చింది. మద్దతు ధరలు ఉన్నా తీవ్రంగా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

- మాదాసు శంకర్, ధనురేటి, మం. కౌటాల

### మద్దతు ధర పెంచాలి



ఈ సంవత్సరం పండించిన పంటలకు దిగుబడి గణనీయంగా తగ్గింది. ఖర్చులు పెరగడంతో మద్దతు ధర రైతులకు భరోసా ఇవ్వడం లేదు. వరి, పత్తి పంటలు సాగు చేసిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మద్దతు ధరను పెంచి భరోసా ఇవ్వాలి.

- తిరుపతిగౌడ్, గుడ్లబోరి, మం. కౌటాల

## నేడు కాకడహారతుల ముగింపు

- నదిలో ప్రమిదలు విడువనున్న భక్తులు
- నెల రోజులుగా కొనసాగిన పూజలు



శివాలయంలో మంగళహారతులతో భక్తులు

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయం కాకడ హారతులకు ముస్తాబైంది. నేడు జరగనున్న ఉత్సవానికి మహిళలు సిద్ధమయ్యారు. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగిన కాకడహారతులు నేటితో ముగియనున్నాయి. భక్తులు వేకువజామున నిద్రలేచి నూతన వస్త్రాలు ధరించి శివాలయానికి చేరుకొని పూజలు చేశారు. భజనలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రతీరోజు రావి చెట్టుకు ప్రత్యేక పూజలు జరిపారు.

**నేడు గంగాదేవికి ప్రత్యేక పూజలు**

నేడు మండలంలోని సాంగ్వి పెద్దవాగుకు భక్తులు చేరుకొని నీటిలో ప్రమిదలు జార విడువనున్నారు. గంగాదేవికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. కార్తీక మాసాన్ని హిందువులు పవిత్రమాసంగా భావిస్తారు. ఈ సందర్భంగా నేడు మహాఅన్నదానం, అభిషేకాలు, గంగాస్నానం వంటి కార్యక్రమం నిర్వహించనున్నారు.

### ముస్తాబైన శివాలయం



విద్యుత్ దీపాల్లో శివాలయం

కెరమెరి: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయం విద్యుత్ వెలుగులో విరజిల్లుతోంది. భక్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో సుందరంగా అలంకరించారు. మహిళలు దీపోత్సవంలో భాగంగా కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి 1001 దీపాలు వెలిగించనున్నారు.

**పూలు, దీపాలతో రావాలి**

కెరమెరి: నేడు మండల కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించే కార్తీక పౌర్ణమి సందర్భంగా కాకడహారతులకు వచ్చే మహిళా భక్తులు పూలు, దీపాలతో తరలిరావాలని అర్చకుడు కులకర్ణి బాపూదేవ్, ప్రముఖులు తెలిపారు.

## జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం



కోవ లక్ష్మికి స్వాగతం పలుకుతున్న మహిళలు

ఆసిఫాబాద్/తిర్యాణి/ రెబ్బెన: ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి రెబ్బెన మండల కేంద్రంలో రోడ్‌షోతో పాటు భారీ ర్యాలీ నిర్వహించి బల ప్రదర్శన చూపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి చూసి తమను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. కాగా తిర్యాణి మండలం గుండాల గ్రామానికి చెందిన 200 మంది ఆదివాసీలు ఆదివారం పార్టీ నాయకురాలు మర్సుకోల సర్వసతి సమక్షంలో పార్టీలో చేరారు. రెబ్బెన మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో పార్టీ నాయకులు కోవ లక్ష్మి గెలవాలని ప్రత్యేక పూజలు చేశారు.

### కాంగ్రెస్ అభ్యర్థి రోడ్ షో



రెబ్బెనలో మాట్లాడుతున్న శ్యాంనాయక్

రెబ్బెన: మండలంలోని కైరిగాం, వంకులం, రాంపూర్, ఇందిరానగర్, రెబ్బెన, నంబాల, రోళ్లపాడు, తక్కళ్లపల్లితో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిజాం పాలన పోయి ఇందిరమ్మ రాజ్యం రావాలంటే చేయి గుర్తుకు ఓటు వేయాలన్నారు.

### బీజేపీ బైక్ ర్యాలీ

ఆసిఫాబాద్: బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్ నియోజకవర్గంలో ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బీజేపీ బైక్ ర్యాలీ నిర్వహించింది.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



వాంకిడి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



పెంచికల్‌పేట్: అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాడి మిలింద్‌కుమార్, పాండురంగా, కిషన్, మారుతి, శేఖర్, సందీప్, టీమాజీ, శంకర్, మనోహర్, ధర్మరాజ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

**కేజీబీవీలో..**

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగ విలువలు, స్ఫూర్తి, రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు.

**లింగాపూర్‌లో..**

లింగాపూర్: మండల కేంద్రంలోని కరుణ బౌద్ధ విహార్‌లో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని మండలంలోని అంబేద్కర్ కమిటీ ఆధ్వర్యంలో బౌద్ధ ఉపాసనలు, బౌద్ధ ఉపాసికులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులు, కరుణా మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

### 'కేసీఆర్ దోపిడీ పాలనకు చరమగీతం పాడాలి'



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

బెజ్జూర్/సిర్పూర్(టి): ఎన్నికల్లో కేసీఆర్ దోపిడీ పాలనకు చరమగీతం పాడాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సిర్పూర్, బెజ్జూర్‌లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సిర్పూర్ గడ్డపై నీలి జెండా ఎగరడం ఖాయమన్నారు. మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని, కోనప్పను ఓడించాలని పేర్కొన్నారు. ఆయన వెంట బీఎస్పీ నాయకులు ఉన్నారు.


### 'మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చుతాం'



మాట్లాడుతున్న డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్: మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించే బాధ్యత తీసుకుంటానని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణపెల్లి, సోమిని, మొగవెల్లి, పాపన్నపేట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు.

## 'కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలి'



యువకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యేలు

పెంచికల్‌పేట్/కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని చీలపెల్లి, మేడిపల్లి, రామన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం సిర్పూర్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పకు మద్దతుగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నిల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాగా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ప్రధాన మార్కెట్ ఏరియాలో కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి ప్రచారం నిర్వహించారు.

### 'పోస్టల్ ఓటుకు ఇబ్బందులు'

కాగజ్‌నగర్‌టౌన్: పోస్టల్ ఓటు విషయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహిపాల్ అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దీపక్ తివారీకి ఆదివారం వినతిపత్రం అందించారు. అర్హులైన ప్రతిఒక్కరూ పోస్టల్ ఓటు వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### 'బీఆర్‌ఎస్, బీజేపీ ప్రజా వ్యతిరేక పార్టీలు'

వాంకిడి: బీఆర్‌ఎస్, బీజేపీ ప్రజావ్యతిరేక పార్టీలని భారత్ బచావో సంఘం నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు.

### నేడు కాగజ్‌నగర్‌లో అణగారిన వర్గాల ఆత్మగౌరవ సభ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అణగారిన వర్గాల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు బీజేపీ సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సామాజిక ఉద్యమకారుడు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని వెల్లడించారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవ సభలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### కాగజ్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఆదివారం సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక్క అవకాశం కాంగ్రెస్ పార్టీకి ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పెద్దవాగు తీరాన కార్తీక శోభ



వాగులో దీపాలు వదులుతున్న భక్తులు

దహెగాం: కార్తీక మాసంలో ప్రతీరోజు స్థానిక శివాలయంలో మహాప్రదక్షిణ యజ్ఞం కొనసాగుతోంది. ఆదివారం కార్తీక మాసం పురస్కరించుకొని పాత దహెగాం పెద్దవాగు తీరాన కార్తీక సందడి నెలకొంది. ఉదయమే భక్తులు గంగ స్నానం ఆచరించారు. వేదపండితుడు పరమేశ్వర్ ఆధ్వర్యంలో వాగు ఒడ్డున సైకత లింగం తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు గంగ హారతి ఇచ్చారు. శివాలయం, అభయాంజనేయ స్వామి అలయాల్లో భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు.



సైకత లింగం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గంగ హారతి ఇస్తున్న వేదపండితుడు

### ప్రవీణ్‌కుమార్ రాక

ఆసిఫాబాద్: బీఎస్పీ రాష్ట్ర చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం జిల్లా కేంద్రానికి రానున్నట్లు స్వతంత్ర అభ్యర్థి కొట్నాక విజయ్‌కుమార్ తెలిపారు. తనకు మద్దతుగా జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొంటారన్నారు.